మేలైన జన ఔషధి

- గ్రామాల్లో పెరుగుతున్న జనరిక్ మందుల వినియోగం
- బ్రాండెడ్ మందుల కొనుగోలుతో ఆర్థిక భారం
- మందులపై 10 నుంచి 80 శాతం ధరల తగ్గుదల


రామచంద్రపురంలోని జనరిక్ మందుల షాపు

కపిలేశ్వరపురం: జనరిక్ మందులు అంటే బ్రాండెడ్ మందులతో సమానమైన క్రియాశీల పదార్థాలను కలిగి ఉన్న మందులు, కానీ తక్కువ ధరకే ఇవి లభిస్తాయి. పేటెంట్ గడువు ముగిసిన తర్వాత, ఇతర కంపెనీలు కూడా అదే మందును తయారు చేసి అమ్మవచ్చు. మారిన జీవన శైలి నేపథ్యంలో మానవుడు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నాడు. ప్రైయివేట్ దుకాణాల్లో లభ్యమయ్యే మందులు బ్రాండెడ్‌వి కావడంతో అధిక ధరలతో విక్రయిస్తారు. జనరిక్ మందులు, బ్రాండెడ్ మందుల వలె అదే నాణ్యత ప్రమాణాలకు లోబడి ఉంటాయి. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రభావం పెరగనున్న నేపథ్యంలో మందుల వినియోగం పెరగనుంది. ఇలాంటి పరిస్థితుల్లో అవగాహన అవసరం. మందుల వినియోగాన్ని పెంచాలన్న లక్ష్యంతో 2023లో నేషనల్ మెడికల్ కమిషన్ రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టిషనర్స్ (ఎన్‌ఎంసీఆర్‌ఎంపీ) ఎన్‌ఆర్‌సీఆర్‌ఎంపీ నియమావళి–2023ను తీసుకొచ్చింది.

ధరల్లో వ్యత్యాసాలిలా..

ప్రైయివేటు షాపులలో మందులను ఎమ్మార్పీ ధరలకే విక్రయిస్తున్నప్పటికీ ఆ ఎమ్మార్పీ రేటు నిర్ధారణలోనే కంపెనీలు లాభార్జనకు అధిక ప్రాధాన్యమిస్తున్నాయని ప్రజా సంఘాల నాయకులు చెబుతున్నారు. తయారీదారులు, డిస్ట్రిబ్యూటర్లు, రిటైల్‌దారులు ఇలా పలు చేతులు మారాల్సి ఉండటంతో ధర అధికంగా ఉండటానికి ఓ కారణమంటున్నారు. ప్రైయివేట్ షాపుల విక్రయాలతో పోలిస్తే జనరిక్ దుకాణాల్లోని మందుల ధరలు 10 నుంచి 80 శాతం పైగా తక్కువ ఉంటుంది. పారాసిట్మాల్ 10 మాత్రలు ధర జనరిక్ షాపులో రూ.12 కాగా ప్రైవేట్ షాపులో రూ.20 నుంచి రూ.30 ఉంటుంది. బీపీ 10 మాత్రలు ధర జనరిక్‌లో రూ.12 కాగా బ్రాండెడ్‌లో రూ.80, షుగర్ 10 మాత్రలు రూ.15 కాగా, బ్రాండెడ్‌లో రూ.50, జింక్ మల్టీ విటమిన్ 15 మాత్రలు జనరిక్‌లో రూ.20 కాగా బ్రాండెడ్‌లో 105, గ్యాస్టిక్ 15 మాత్రలు రూ.15 ఉండగా బ్రాండెడ్‌లో 135, సి.విటమిన్ పది మాత్రలు ధర రూ.40 కాగా ప్రైయివేట్ షాపులో రూ. 70, డి.విటమిన్ నాలుగు కాప్సుల్స్ ధర జనరిక్‌లో రూ.40 కాగా ప్రైవేట్‌లో రూ.90ఇలా అనేక మందుల ధరల్లో భారీగా వ్యత్యాసాలున్నాయి.


మందులు

ఎన్‌ఎంసీఆర్‌ఎంపీ నిబంధనలిలా

జనరిక్ మందులు రాయాలంటూ 2002లోనే భారత వైద్య మండలి (ఐఎంసీ) నింబధనలను రూపొందించినప్పటికీ రాయకపోతే తీసుకోవాల్సిన చర్యలను ప్రస్తావించలేదు. 2023లో నేషనల్ మెడికల్ కమిషన్ రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టిషనర్స్ (ఎన్‌ఎంసీఆర్‌ఎంపీ) నియమావళి–2023ను తీసుకురాగా అది అమల్లోకి తెచ్చినట్టు జాతీయ వైద్య కమిషన్ వెల్లడించింది. దాని ప్రకారం రోగులకు చౌకగా లభించే జనరిక్ మందులను రాయాలని, రాయని వైద్యులపై లైసెన్స్ రద్దు చేయడం లాంటి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేసింది.

జనరిక్ షాపులోనే మందులు కొంటాను



వైద్యులు జనరిక్ మందులు మంచివని చెప్పారు. నాణ్యతపై అపోహలు వీడాలని సూచించారు. నాణ్యమైన మందులు సాధారణ షాపుల కంటే తక్కువ ధరకు లభ్యమవుతున్నాయి. నా కుటుంబ సభ్యులు కోసం నేను జనరిక్ షాపులోనే మందులను కొంటున్నాను.

– పీవీ రమణ, వల్లూరు

నేపథ్యమిదీ..

సామాన్యులకు తక్కువ ధరలకే ఔషధాలను అందించాలన్న ప్రధాన లక్ష్యంతో 2015లో జనరిక్ దుకాణాలను ఏర్పాటు చేసినప్పటికీ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం వాటి సంఖ్యను విస్తృతపర్చలేదు. మండపేట నియోజకవర్గంలో 7, రామచంద్రపురంలో 9 మొత్తం 16 పీహెచ్‌సీలు, పలు సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల ద్వారా ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందుతుంది. వాటికి తోడు విస్తారంగా ప్రైవేటు ఆసుపత్రులున్నాయి. రామచంద్రపురం పట్టణంలో 3, మండపేటలో 2, ద్రాక్షారామ, కాజులూరు, కె.గంగవరంలలో ఒక్కొక్కటి చొప్పున ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల్లో జనరిక్ షాపులున్నాయి.

క్లుప్తంగా

మండల వ్యవసాయాధికారిగా రమేష్‌కుమార్



రాయవరం: మండల వ్యవసాయాధికారిగా కేవీఎస్ రమేష్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా రమేష్‌కుమార్ కపిలేశ్వరపురం మండలం నుంచి రాయవరం మండలానికి వచ్చారు. ఇప్పటి వరకు మండల వ్యవసాయాధికారిగా బాధ్యతలు నిర్వర్తించిన కొప్పిశెట్టి ప్రభాకర్ బదిలీపై మండపేట మండల ఏవోగా వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన ఏవో రమేష్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయపరంగా మండలాన్ని అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని, రైతులకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాయవరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధ, గురువారాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. ఈ విషయాన్ని ఈపీడీసీఎల్ రామచంద్రపురం డివిజన్ ఈఈ కె.రత్నాలరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 5 నుంచి సాయంత్రం ఆరు గంటలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. రామచంద్రపురం నుంచి కొత్తపేట, ముమ్మిడివరం వెళ్లే 132/33 కేవీఏ విద్యుత్ ఉప కేంద్రలో 132 కేవీఏ డబుల్ సర్క్యూట్ పాడైనందున టవర్లు తొలగించి, కొత్త టవర్లు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. దీని నిమిత్తం 33/11 కేవీఏ, 11కేవీఏ/ఎల్‌టీ లైన్ క్రాసింగ్ ఉన్నందున రాయవరం సెక్షన్‌లో వెంటూరు గ్రామ శివారు చొల్లంగిపేట ఏరియాకు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని కోరారు.

పొట్టి శ్రీరాములు త్యాగం స్ఫూర్తిదాయకం


మండపేటలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): పొట్టి శ్రీరాములు త్యాగం స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పలువురు వక్తలన్నారు. మండపేటలోని సూర్య ఫంక్షన్ హాల్ మంగళవారం పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది మార్చి 16 నుంచి 2026 మార్చి 16 వరకూ పొట్టి శ్రీరాములు జయంత్యుత్సవాన్ని ప్రభుత్వం తరపున నిర్వహించడాన్ని కోనసీమ జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు ప్రశంసించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మాట్లాడుతూ మహనీయుల మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నాయకులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

అన్నదాతా సుఖీభవకు ఈ–కేవైసీ అవసరం లేదు

కాజులూరు: అన్నదాతా సుఖీభవ పథకం కోసం ఈ–కేవైసీ అవసరం లేదని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. శలపాక రైతు సేవాకేంద్రంలో మంగళవారం ఆయన రైతులతో మాట్లాడుతూ ఈ పథకం కోసం రైతులందరూ రైతు సేవాకేంద్రానికి వచ్చి వేలిముద్రలు వేయడం ద్వారా ఈ–కేవైసీ చేయించుకోవాలని గతంలో ప్రకటించటం జరిగిందన్నారు. అయితే జీఎస్ డబ్ల్యూ వద్ద ఉన్న డేటా ఆధారంగా ప్రభుత్వం ఈ పథకానికి అర్హులను ఎంపిక చేయనుందన్నారు. ఎవరైనా డేటాలో పేర్లు లేనివారు ఉంటే రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయశాఖ సిబ్బంది పరిశీలించి రైతులకు సమాచారమందిస్తారన్నారు. వారు మాత్రమే తప్పని సరిగా రైతుసేవాకేంద్రాలకు వచ్చి వేలిముద్రలు వేసి ఈ–కేవైసీ నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక రైతు సేవాకేంద్రం వీఏఏ వి.అనూష, గొల్లపాలెం రైతు సేవాకేంద్రం వీఏఏ వనుం రమ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్‌తో దేశాభివృద్ధి

కపిలేశ్వరపురం (మండపేట): వికసిత్ భారత్ నినాదంతో దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది ఉన్నతస్థానంలో నిలుస్తుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సత్యనారాయణ అన్నారు. మండపేటలో మంగళవారం బీజేపీ 11 సంవత్సరాల పాలనలో సాధించిన ప్రగతిపై కరపత్ర ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గూడవల్లి రాంబాబు, వల్లభనేని రవీంద్ర బాబు, చెరుకూరి గోపాల కృష్ణ, చుండ్రు బార్గవ్, జగతా రఘువీర్, మద్దుల సుబ్బారావు, సందక వీరవెంకట సత్యనారాయణ, మల్లువలస రాజశేఖర్, నాయుడు రాంబాబు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కపిలేశ్వరపురం (మండపేట): ఆరోగ్య సమస్యలతో సతమతమైన కుటుంబాలకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ ఆర్థిక సాయం చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వేగుళ్ల క్యాంపు కార్యాలయంలో 36 మంది లబ్ధిదారులకు రూ.32,38,117 విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారుల గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరోగ్య అంశాలపై అవగాహన అవసరం


చినకోరుమిల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న బృందం అధికారులు

కపిలేశ్వరపురం: ఆరోగ్య అంశాలపై క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరికీ కనీస అవగాహన అవసరమని ప్రజల ఆరోగ్య అంశాల్లో నాణ్యతపై చేపట్టిన ప్రత్యేక సర్వే కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులన్నారు. అందులో భాగంగా క్వాలిటీ అసెస్‌మెంట్ సర్వే పేరుతో ఎస్‌పీఎం డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మండలంలోని కోరుమిల్లి గ్రామ శివారు చిన కోరుమిల్లిలో ప్రజలతో వైద్యాశాఖాధికారులు మమేకమయ్యారు. కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలోని కమ్యూనిటీ మెడిసిన్ విభాగం హెచ్‌ఓడీ డా.పి.సుజాత ఆధ్వర్యంలోని పీజీ విద్యార్థులు చిన్న కోరుమిల్లిలో పర్యటించారు. గతంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది చేసిన ఎన్‌సీడీ 3.0 సర్వే తీరును, సర్వే చేయడంలోని నాణ్యతను పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి నివేదికను రూపొందించారు. సర్వేలో గుర్తించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని డాక్టర్ సుజాత అన్నారు. ఈ కార్యక్రమంలో వాకతిప్ప పీహెచ్‌సీ వైద్యాధికారి డా.చిట్టూరి రాకేష్‌చౌదరి, సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, నాయకులు మోటిపల్లి బాపిరాజు, వి.వీరభద్రం, హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ పి.దీనదయాల్ బిషప్, ఎంపీహెచ్‌ఎస్ కామేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ ప్రశాంతి, ఏఎన్‌ఎం దుర్గాదేవి, వైద్య, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏవో ప్రభాకర్‌కు ఘనంగా వీడ్కోలు


ఏవో ప్రభాకర్‌ను సత్కరిస్తున్న తహసీల్దారు శెట్టి, మండల వ్యవసాయ సహాయకులు

రాయవరం: బదిలీపై వెళ్తున్న మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్‌కు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. మండల వ్యవసాయ సహాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన వీడ్కోలు సభకు తహసీల్దారు ఐ.పి.శెట్టి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దారు శెట్టి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పనిసరి అని, అయితే బదిలీ కాలంలో ఉద్యోగి ప్రజలకు అందించే సేవలు వారి మనస్సుల్లో స్థానాన్ని నిలుపుతాయన్నారు. ఏవో ప్రభాకర్ అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. అనంతరం ఏవో ప్రభాకర్‌ను మండల వ్యవసాయ సహాయకుల ఆధ్వర్యంలో దుశ్శాలువా, పూలమాలలు, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుల అధ్యక్షుడు తాతపూడి తులసీధర్, సెక్రటరీ కృష్ణతేజ పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు అమానుషం


చేదువాడ వంతెనపై ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం సభ్యులు

కాజులూరు: పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న అమానుష దాడులను నిరసిస్తూ చేదువాడ వంతెనపై మంగళవారం భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.రాజశేఖర్, పార్టీ మండల కమిటీ కన్వీనర్ వల్లు రాజబాబు తదితరులు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి పాలస్తీనాపై యుద్ధం వెంటనే విరమించాలని తీర్మానం చేసినప్పటికీ అమెరికా అండతో ఇజ్రాయెల్ కిరాతకంగా దాడులకు పాల్పడుతుందన్నారు. ప్రపంచ శాంతి వర్ధిల్లాలి అంటూ ఓ పక్క వేదాలు వల్లిస్తూ మరో పక్క ఆయుధ వ్యాపారం కోసం యుద్ధాలను ప్రోత్సహిస్తున్న అమెరికా వైఖరిని ప్రపంచ దేశాలు ఖండించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కురుపూడి భూచక్రం, దంగేటి శ్రీను, గంజా అప్పారావు, గుత్తుల సూర్యనారాయణ, పెంకే శ్రీను, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి సేవలు ప్రశంసనీయం


వెలగతోడులో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న గ్రామస్తులు

కపిలేశ్వరపురం (మండపేట): సమాజంలో ఉపాధ్యాయుడి పాత్ర కీలకమని పలువురు వక్తలు అన్నారు. మండపేట మండలం వెలగతోడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సేవలందించి బదిలీపై వెళ్తున్న సైన్స్, గణితం, హిందీ ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఆలీ, కృష్ణమూర్తి సఫీర్ అహ్మద్‌ను గ్రామస్తులు మంగళవారం ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం కె.లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ఉపాధ్యాయుడు రామిరెడ్డి వెంకటరమణ, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ పిల్లి మమత, ఉపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయులు అందించిన సేవలను కొనియాడారు. పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు శ్రీహరి, వీర్రాజు, వెంకట్రావు, తారకంకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయిబాబు, యేసు రాజు, వీరభద్రరావు, జనార్ధనరావు, సహదేవుడు, ఆనంద్, కృపామణి, రత్నకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత


కూళ్లలో విద్యార్థులకు పంపిణీ చేసిన దాత అందించిన పుస్తకాలు, సామగ్రి

కె.గంగవరం: మండలంలోని అముజూరు, కూళ్ల గ్రామాల్లో ప్రాథమిక విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు విశాఖపట్నంలో స్థిరపడిన మల్లికార్జున ట్రాన్స్‌పోర్టు అధినేత బోజంకి సోమేశ్వరరావు రూ.40 వేలు విలువైన నోటు పుస్తకాలు, విద్యా సామగ్రి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామల సర్పంచులు చిల్లే నాగేశ్వరరావు, నానాపురపు కల్యాణి, ప్రధానాపాధ్యాయులు శ్రీమన్నారాయణ, ప్రేమ్‌కుమార్, పులిదిండి శ్రీనివాస్, దాసరి శ్రీను, వెంకటరమణ, మణికంఠ, మల్లికార్జునరావు, చొల్లంగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

20న డయల్ యువర్ డీఎం


పేపకాయల భాస్కరరావు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం ఆర్టీసీ డిపోలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావు మంగళవారం విలేకరులకు తెలిపారు. ఆర్టీసీ ప్రయాణికులు, ప్రజలు తమ సూచనలు, సలహాలు ఫోన్ నంబరు 08857 242004 కు తెలియజేయాల్సిందిగా కోరారు.

రామచంద్రపురం ఏఓగా మణిదీప్



రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండల వ్యవసాయ అధికారిగా టీవీఆర్ మణిదీప్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్.సత్యప్రసాద్ కాకినాడ జిల్లా పెదపూడికి బదిలీ కాగా మణిదీప్ రామచంద్రపురం ఏఓగా బదిలీపై వచ్చారు. మణిదీప్‌కు గతంలో కూడా రామచంద్రపుం మండల వ్యవసాయ అధికారిగా పనిచేసిన అనుభవం ఉంది. మండలంలోని వ్యవసాయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

ఎంటీయూ 1318 వరి రకాన్ని సాగు చేయాలి

రాయవరం: అన్నదాత సుఖీభవ పథకంలో ఈకేవైసీ ఈ నెల 18వ తేదీలోగా పూర్తి చేయాలని రాయవరం మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన రాయవరంలోని తన కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో నిర్వహించిన సమావేశంలో ఏవో ప్రభాకర్ మాట్లాడుతూ ఖరీఫ్‌కు విత్తనాల ఎంపిక, నారుమడి యాజమాన్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల యాజమాన్యం చేపట్టాలని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో ఎంటీయూ 7029 (స్వర్ణ) బదులుగా ఎంటీయూ 1318 వరి రకాన్ని సాగు చేయాలన్నారు. ఎంటీయూ 1318 వరి రకం ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొని అధిక దిగుబడి ఇస్తుందన్నారు. పొలం గట్టుపై కూరగాయలు సాగు చేసి, అదనపు ఆదాయాన్ని పొందవచ్చునన్నారు. తక్కువ మోతాదులో పురుగు మందులు ఉపయోగించి, పండించిన పంట ఉత్పత్తులు ఆరోగ్య సమస్యలను దూరం చేస్తాయన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాల్లో లోపించిన పారదర్శకత

అలమూరు: రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి వల్ల ఇసుక తవ్వకాల్లో పారదర్శకత లోపించిందని మండల కమ్యూనిస్టు పార్టీ శాఖ తీవ్రంగా ఆరోపించింది. స్థానిక స్వచ్ఛంద సమతా కార్యాలయంలో మంగళవారం కొత్తపేట నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి కె.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న జిల్లా కార్యదర్శి సత్తిబాబు పాల్గొని ప్రసంగించారు. జిల్లాలో ఇసుక ర్యాంపులు అన్నిట్లో ఇసుక, మట్టిలో జరుగుతున్న దోపిడీని ప్రభుత్వం అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం జరిపిన ఇసుక అక్రమాలపై సిట్ వేసిన ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి ప్రస్తుత తవ్వకాలపై కూడా విచారణ చేసి నిగ్గు తేల్చాలని ఆయన కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.రవికుమార్, సమితి సభ్యులు సామ్యూల్, యేసురాజు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టడమే బాబు లక్ష్యం


హసన్‌బాదలో జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం పుస్తకావిష్కరణ చేస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు


కె.గంగవరంలో పుస్తకావిష్కరణ చేస్తున్న నాయకులు

- వైఎస్సార్ సీపీ నాయకుల మండిపాటు
- జగన్ అంటే నమ్మకం–బాబు అంటే మోసం పుస్తకావిష్కరణ

రామచంద్రపురం రూరల్: ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టే విధంగా హామీలు ఇవ్వడం గద్దెనెక్కాక ఎన్నికల హామీలను పక్కదారి పట్టించడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని రామచంద్రపురం మండల వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. మండలంలోని హసన్‌బాదలో బీసీ కల్యాణ మండపంలో పార్టీ మండల అధ్యక్షుడు పోలినాటి వరప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. పోలినాటి వరప్రసాద్, ఎంపీపీ అంబటి భవాని, పార్టీ నియోజకవర్గ అధ్యక్షురాలు యల్లమిల్లి సతీష్ కుమారి, జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళీకృష్ణ, రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్ తదితరులు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ అంటే మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి, అమ్మఒడి అంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే గుర్తు వచ్చేలా ప్రజల కోసం పథకాలు ఆలోచించి అమలు చేశారన్నారు. కానీ చంద్రబాబు వారి పథకాలు కాపీ కొట్టి పేర్లు మార్చి అమలులో మాత్రం అడ్డగోలు విధానాలు పాటిస్తూ ప్రజలను మోసం చేస్తున్నాడన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి అమలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డి అంటే ప్రజల్లో అందుకే నమ్మకం అని, అదే చంద్రబాబు విషయంలో మాత్రం ఎన్నికల హామీలను పక్కదారి పట్టిస్తూ మరోసారి మోసగాడిగా నిరూపించుకున్నాడన్నారు. కార్యక్రమంలో నాయకులు కట్టా సూర్యనారాయణ, పెంకే వీరరాఘవులు, నేదునూరి జగ్జీవన్‌రావు, దడాల రవికుమార్, దంగేటి చిన బాబు, దడాల వెంకటరమణ, సర్పంచ్‌లు వీరబోయిన సూరిబాబు, పెమ్మిరెడ్డి రామకృష్ణ, కట్టా గోవిందు, ఎంపీటీసీలు తుమ్మూరి సుబ్బలక్ష్మి, నురుకుర్తి శ్రీరామకృష్ణ, పంపన ఏడుకొండలు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

గత ఏడాదిగా రాష్ట్రంలో మోసపు పాలన

కె.గంగవరం: గడచిన ఏడాదిగా రాష్ట్రంలో మోసపు పాలన సాగుతోందని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. మండలంలోని కె.గంగవరం బీసీ కల్యాణ మండపం వద్ద మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పెట్టా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జగనంటే నమ్మకం–చంద్రబాబు అంటే మోసం పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. పెట్టా శ్రీనివాసరావు, ఎంపీపీ పంపన నాగమణి, మాట్లాడుతూ ఏడాది పాటు కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఎగ్గొట్టి ప్రశ్నించేవారిని తప్పుడు కేసుల్లో ఇరికిస్తూ రాక్షస పాలన చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అరాచకాలు, అక్రమాలు, ప్రజలను వంచిస్తున్న విధానాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వట్టికూటి రాజశేఖర్, మండల కోఆప్షన్ సభ్యుడు కొప్పిశెట్టి లక్ష్మణ్, సర్పంచ్‌లు తోకల శ్రీనివాస్, చిల్లే నాగేశ్వరరావు, నాయకులు పంపన సుబ్బారావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవతల తీర్థం


అవిడిలో కట్వలాంబిక అమ్మవారి గరగలను ఊరేగిస్తున్న భక్తులు

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడిలో గ్రామదేవతగా పూజలందుకుంటున్న మురుగులమ్మ, మాగంలో గ్రామదేవతలుగా పూజలందుకుంటున్న కనకమహాలక్ష్మి, మరిడమ్మలకు మంగళవారం తీర్థ మహోత్సవాలు ఘనంగా జరిపారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గరగ నృత్యాలు, చిత్ర విచిత్ర వేషధారణలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అమ్మవార్లను పెద్ద ఎత్తున భక్తులు దర్శించి కానుకలు మొక్కులు చెల్లించారు. చలివిడి, వడపప్పు, బెల్లంపానకం వంటివి నైవేద్యంగా సమర్పించారు.

వైభవంగా కట్వలాంబిక అమ్మవారి తీర్థం

కొత్తపేట: మండలంలోని అవిడి గ్రామ దేవత కట్వలాంబిక అమ్మవారి జాతర, తీర్థమహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి చిన్న జాతర, సోమవారం రాత్రి పెద్ద జాతర జరిపారు. మంగళవారం తీర్థ మహోత్సవాలను దేవస్థానం ఈఓ కామేశ్వరరావు, దేవదాయ శాఖ అధికారులు, సిబ్బంది పర్యవేక్షణలో, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. వీధి వీధినా అమ్మవారికి భక్తులు భక్తిశ్రద్ధలతో స్వాగతం పలికారు. ఇంటింటా భక్తులు పసుపు, కుంకుమలు, పానకాలు, ఇతర నైవేద్యాలు, మొక్కులు సమర్పించారు. కట్వలాంబిక తీర్థం పురస్కరించుకుని అవిడి గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో గ్రామం భక్తులతో కిటకిటలాడింది. కొత్తపేట ఎస్సై జి.సురేంద్ర ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

మట్టపర్రులో పొలంబడి


మట్టపర్రు పొలంబడిలో పాల్గొన్న ఏవో రమ్య ప్రియాంక

మలికిపురం: మండలంలో మట్టపర్రులో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చింత రమ్య ప్రియాంక పాల్గొని రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులు వివరించారు. సార్వా సాగుకు సిద్ధమవ్వాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా భూసార పరీక్ష ఫలితాలు, ఈ–కేవైసీ నార్మల్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వరి రకం 1318 రకం యొక్క ఆవశ్యకత గూర్చి రైతులతో చర్చించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు పి.శివరామకృష్ణ, టీడీ షణ్ముఖ, మట్టపర్రు విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.